సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 20 । మే । 2024



రూ.51,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గునిశెట్టి శ్రీనివాస్ (పుణే) ఆదివారం రూ.51,116 విరాళం సమర్పించారు.



స్నానాల సరదా ప్రాణాల మీదికి

వేసవి సెలవుల్లో ఆటవిడుపుగా గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు వెళ్తున్న యువకులు సరైన జాగ్రత్తలు తీసుకోక మృత్యువాత పడుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0°/25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	37.0	25.0
కాకినాడ	36.3	27.4
అమలాపురం	40.0	27.0

న్యూస్‌రీల్

ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్ శుక్లా



నార్కెడ్‌మిల్లిలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్సు శుక్లా

ఆత్రేయపురం: మండల పరిధిలోని నార్కెడ్‌మిల్లి గ్రామంలో ఆదివారం ఇసుక రీచ్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులతో కలిసి పరిశీలించారు. రీచ్‌లో తహసీల్దారు ఎం. వెంకట్రామయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక రీచ్ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండటంతో రీచ్‌ను తెరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భవానీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళంతో ఆలయానికి రంగులు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలో కొలువు తీరిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి రంగులు వేసేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీఎంఆర్ సంస్థ చైర్మన్ మావూరి వెంకటరమణ, వెంకట పద్మావతి దంపతులు రూ.5 లక్షలు విరాళంగా అందించారు. దాత ఇచ్చిన విరాళంతో ఆలయాన్ని రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయ నిర్మాణ సమయంలో ప్రహరీ వెంకటరమణ దంపతులు రూ.5 లక్షలు ఇచ్చారని ఆలయ నిర్వాహకులు కారుపర్తి కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రంగులకు మరో రూ.5 లక్షలు ఇచ్చారని చెప్పారు. భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయానికి వెంకటరమణ దంపతులు మొత్తం రూ.10 లక్షలు విరాళంగా అందించారని పేర్కొన్నారు. ఆలయానికి భారీగా విరాళం అందించిన దాతను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

అయినవిల్లిలో కిక్కిరిసిన భక్తులు



అయినవిల్లి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్య లో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకాల్లో 37మంది, లక్ష్మీగణప తి హోమంలో 32 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. 29 మంది నూతన వాహన పూజలు నిర్వహించుకోగా, ఏడుగురు చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. అయిదుగురు భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,740 మంది ప్రసాదం స్వీకరించారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,05,000 ఆదాయం లభించిందని ఆలయ చైర్మ న్ గుత్తుల నాగబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

దిండి టూరిజం అభివృద్ధికి రూ.6 కోట్లు

మలికిపురం: ప్రముఖ పర్యాటక కేంద్రం దిండి టూరిజం కేంద్రం అభివృద్ధికి టూరిజం శాఖ రూ.6 కోట్లు మంజూరు చేసింది. దీంతో స్థానిక రిసార్ట్ రీ మోడల్‌కు సంబంధించి తొమ్మిది పనులు చేపట్టినట్టు స్థానిక టూరిజం కేంద్ర అధికారులు ఆదివారం తెలిపారు. ఫైవ్‌స్టార్ హోటల్‌గా దిండి రిసార్ట్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

లోవలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆరు వేల మంది భక్తులు క్యూలో అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,68,285, పూజా టికెట్లకు రూ.87,450, కేశఖండన శాలకు రూ.21,280, వాహన పూజలకు రూ.3,700, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.81,856, విరాళాలు రూ.7,052 కలిపి మొత్తం రూ.3,69,623 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.



కల్యాణం జరిపిస్తున్న పండితులు, అర్చక స్వాములు



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చక స్వామి



విజయవాడ దుర్గమ్మ దేవస్థానం తరఫున సత్యదేవుడు, అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు

కల్యాణం.. కమనీయం..

- వైభవంగా సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణోత్సవం
- తిలకించి పులకించిన భక్తజనం
- విద్యుద్దీప కాంతుల్లో ప్రకాశించిన రత్నగిరి



కల్యాణోత్సవానికి తరలివచ్చిన ప్రముఖులు, భక్తులు

అన్నవరం: కోరిన కోర్కెలు తీర్చే భక్తవరదుడు.. సత్యమైన దైవంగా ఖ్యాతికెక్కిన రత్నగిరి వాసుడు అయిన ఆ సత్యదేవుడు.. సమస్త సిరులు వర్షించే ఆ అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని పరిణయమాడిన వేళ.. ఆ ఉత్సవాన్ని భక్తులు కన్నులారా తిలకించి మురిసిపోయారు. వేదమంత్రాల సాక్షిగా అమ్మవారి మెడలో స్వామివారు మాంగల్యధారణ చేస్తున్న శుభసందర్భంలో అన్నవరం గ్రామంలోని గిరులు, తరులు పులకించిపోయాయి. అన్నవరం క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి వార్షిక దివ్య కల్యాణోత్సవాన్ని వైశాఖ శుద్ధ ఏకాదశి, ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రత్నగిరిపై సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పమాలికలు, రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేసిన వార్షిక కల్యాణ వేదిక మీద రాత్రి 9.30 నుంచి 11 గంటల వరకూ ఈ ఉత్సవాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు.

సీతారాములే పెళ్లిపెద్దలుగా..

రత్నగిరి క్షేత్ర పాలకునిగా పూజలందుకుంటున్న శ్రీ సీతారాములే పెళ్లిపెద్దలుగా వెంట రాగా.. వధూవరులైన అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని, సత్యదేవుడిని.. రాత్రి 8.30 గంటలకు కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. స్వామి, అమ్మవార్లను దివ్యంగా అలంకరించిన సింహాసనంపై, సీతారాములను అక్కడే ప్రత్యేక ఆసనంపై వేంచేయించారు. దేవస్థానం పండితుల వేదమంత్రాలు, మంగళవాయిద్య ఘోష నడుమ స్వామివారి కల్యాణ వేడుక రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైంది. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు సుధీర్, రామ్‌కుమార్, శర్మ, వైదిక కమిటీ సభ్యుడు చామర్తి వేంకటరెడ్డి పంతులు (కన్నబాబు), వ్రత పురోహితులు నాగాభట్ల రవిశర్మ, అంగర సతీష్, పాలంకి పట్టాభి తదితరులు కల్యాణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కల్యాణ క్రతువు నిర్వహించారిలా..

- స్వామివారి కల్యాణ క్రతువుకు ఎటువంటి అవాంతరాలూ రాకుండా చూడాలని ఆ విఘ్నాధిపతిని ప్రార్థిస్తూ.. విఘ్నేశ్వర పూజతో కల్యాణోత్సవానికి పండితులు తొలుత శ్రీకారం చుట్టారు.
- అనంతరం పుణ్యాహవాచనం, పాణిగ్రహణానికి సంకల్పం, అమ్మవారితో గౌరీ పూజ చేయించారు. ఈ సందర్భంగా 'చతుస్సాగర పర్యంతం.. గోబ్రాహ్మణేభ్యశ్శుభం భవతు..' అంటూ స్వామి, అమ్మవార్ల గోత్రప్రవరలను, వంశకీర్తిని పండితులు వివరించారు.
- తరువాత వరుడైన సత్యదేవునికి అర్చకస్వాములు యజ్ఞోపవీతధారణ గావించారు.
- మహాసంకల్పం, స్వామి వారి పాద ప్రక్షాళన (కాళ్లు కడగడం), కన్యాదానం, మధుపర్కప్రాశన ఘట్టాలను అర్చకస్వాములు సంబంధిత మంత్రాలు పఠిస్తూ నిర్వహించారు.
- అనంతరం 'ధ్రువంతే రాజావరుణో ధ్రువం దేవో బృహస్పతిః ధ్రువంత ఇన్ద్రశ్చాగ్నిశ్చ రాజ్యం ధారయతాం ధ్రువమ్' అంటూ పండితులు సుస్వరంతో వేద మంత్రాలు చదువుతూండగా.. సత్యదేవుడు, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర – బెల్లం ఉంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా స్వామి, అమ్మవార్లు పరస్పరం తొలిసారి ఒకరి కళ్లల్లో ఒకరు చూసుకున్న సన్నివేశాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ భక్తులు పులకించిపోయారు.
- తదనంతరం వధువు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పుట్టబోయే సంతతికి మేలు కలగాలని కోరుతూ యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించారు.
- యోక్త్రధారణ క్రతువు అనంతరం మాంగల్య పూజ చేయించి, మంగళసూత్రాన్ని భక్తులతో దర్శింపజేశారు. ఆ మంగళసూత్రాన్ని రాత్రి 10.47 గంటల సుముహూర్తంలో అమ్మవారి మెడలో స్వామివారి తరఫున అర్చకుడు అలంకరించారు.
- కల్యాణ క్రతువులో అందరినీ మరింత ఉత్సాహపరిచే తలంబ్రాల వేడుకకు అర్చకులు శ్రీకారం చుట్టారు. స్వామివారి తరఫున అమ్మవారి శిరస్సుపై, అమ్మవారి తరఫున స్వామి శిరస్సుపై అర్చకులు తొలుత మంచి ముత్యాల తలంబ్రాలు పోశారు. అదే సమయంలో స్వామివారి గర్భాలయంలో కొలువుదీరిన సత్యదేవుడు, అమ్మవారి మూలవిరాట్టులపై కూడా పండితులు ఊరేగింపుగా వెళ్లి అక్షతలు పోశారు.
- అనంతరం నవదంపతులకు రక్షాబంధనాలు, వేదపండితుల ఆశీస్సులు అందజేసి, స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తిరిగి ప్రధానాలయానికి చేర్చారు.

అన్నవరంలో నేడు

వైదిక కార్యక్రమాలు

- **తెల్లవారుజామున 3.00:** సుప్రభాత సేవ
- **ఉదయం 8.00:** చతుర్వేద పారాయణ
- **సాయంత్రం 5.00:** ప్రధాన స్థాలీపాక హోమాలు
- **రాత్రి 7.00:** నవదంపతులైన స్వామి, అమ్మవార్లకు అరుంధతీ నక్షత్ర దర్శనం
- **రాత్రి 9.00:** కొండ దిగువన రావణబ్రహ్మ వాహనంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు
- ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – 11.00 గంటల వరకూ రత్నగిరి కళావేదిక, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు

పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ

దివ్యకల్యాణ మహోత్సవం సందర్భంగా సత్యదేవునికి, అమ్మవారికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు పట్టు వస్త్రాలు, మంచి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అలాగే, దేవస్థానం తరఫున చైర్మన్ ఐవీ రోహిత్ దంపతులు, ఈఓ కె.రామచంద్ర మోహన్ దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం తరఫున కూడా దేవదాయ కమిషనర్ సత్యనారాయణ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇంకా తిరుమల తిరుపతి దేవస్థానం, ద్వారకా తిరుమల దేవస్థానం తరఫున కూడా ఆయా ఆలయాల పండితులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవం పూర్తయిన అనంతరం తలంబ్రాలు, ప్రసాదాలను సర్క్యులర్ మండపం, బుకింగ్ కౌంటర్, పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులకు పంపిణీ చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా రత్నగిరి, కల్యాణ వేదిక వద్ద చేసిన విద్యుద్దీప, పుష్పాలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి.




ప్రభుత్వం, దేవస్థానం తరఫున సత్యదేవుడు, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ దంపతులు

భారీ బందోబస్తు

కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలను, సిబ్బందిని రత్నగిరిపై కల్యాణ వేదిక వద్ద సిద్ధంగా ఉంచారు. రత్నగిరి మీదకు భక్తుల వాహనాలను పరిమిత సంఖ్యలోనే అనుమతించారు. దేవస్థానం కళాశాల మైదానంలో ఉచిత పార్కింగ్ ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా కొండ దిగువన నిర్వహించాల్సిన వాహన సేవలను రద్దు చేసి, రత్నగిరి పైనే ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు.

ఓటు బదిలీ ఓటిమాటే!

- కోనసీమ జిల్లాలో చిత్తయిన పొత్తు
- కొరవడిన సహకారం
- టీడీపీకి ఓటు వేయని జనసేన క్యాడర్
- జనసేనకు అడుగడుగునా టీడీపీ వెన్నుపోటు
- రెండు పార్టీల ప్రచారానికి బీజేపీ దూరం
- గెలుపుపై కూటమి అభ్యర్థుల డీలా



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సాక్షి, అమలాపురం: ఒకటి ప్లస్ ఒకటి రాజకీయాల్లో ఎప్పటికీ రెండు కాదు అనేది నానుడి. అధికారమే పరమావధిగా కూటమి కట్టిన టీడీపీ, జనసేన, బీజేపీలకు ఈ నానుడి అచ్చు గుద్దినట్టు సరిపోతోంది. కలసి పోటీ అనుకున్న నాటి నుంచి మొదలైన పొరపొచ్చాలు.. సీట్ల కేటాయింపులో బయటపడిన విభేదాలు.. అంటీముట్టనట్టుగా సాగిన ప్రచారం.. వెరసి మిత్ర భేదం కోనసీమ జిల్లాలో పోలింగ్‌పై పడింది. ఇది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు విజయంపై ధీమా లేకుండా చేస్తోంది. పోలింగ్ సరళి వారిని డీలా పడేటట్టు చేసింది.

క్రాస్ ఓటింగ్

మిత్రపక్షాల మధ్య ఓటు బదిలీ కీలకం. పొత్తు పెట్టుకున్న పార్టీల మధ్య 90 శాతం ఓటు బదిలీ జరిగితేనే ఆ పొత్తు విజయవంతమైనట్టు. కనీసం 80 శాతమైనా ఓటు బదిలీ జరిగితే పొత్తు ప్రయోజనాన్ని ఆ పార్టీలు పొందినట్టే. అయితే చాలాచోట్ల ఓటు బదిలీ సగం కూడా జరగలేదని మూడు పార్టీలూ ఒక అంచనాకు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో ఓటింగ్ సరళిని బట్టి వారు ఈ లెక్కలు వేసుకుంటున్నారు. ఈ జిల్లాలో ఆయా సామాజికవర్గాల మధ్య అనాదిగా వస్తున్న వైరం కూడా ఓటింగ్‌ను ప్రభావితం చేసింది. తొలి నుంచీ అనుమానిస్తున్నట్టుగానే టీడీపీ, జనసేనల మధ్య ఓటు బదిలీ అనుకున్న స్థాయిలో జరగలేదు. ఆ విషయాన్ని రెండు పార్టీల అభ్యర్థులూ అంతర్గతంగా అంగీకరిస్తున్నారు. పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో జనసేన నుంచి పోటీ చేసిన గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాదరావులకు చాలా చోట్ల టీడీపీ క్యాడర్ ఓటు వేయలేదు. ఎమ్మెల్యే ఓటు వైఎస్సార్ సీపీకి వేసి, పార్లమెంటుకు వచ్చేసరికి సొంత పార్టీ టీడీపీకి వేసుకున్నారు. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఈ విషయాన్ని వారు బహిరంగంగా అంగీకరిస్తున్నారు. పి.గన్నవరంలో పోలింగ్ రోజు మధ్యాహ్నం నుంచి టీడీపీ క్రాస్ ఓటింగ్ విషయం బయటకు రావటంతో జనసేన కూడా ఇదే పంథాను అనుసరించింది. ఎంపీ ఓటు టీడీపీకి వేయకుండా వైఎస్సార్ సీపీకి వేసి బదులు తీర్చుకున్నారు. రాజోలు నియోజకవర్గంలో సైతం ఇదే పరిస్థితి.

సమన్వయ లోపమే శాపం

అమలాపురం ఎస్సీ నియోజకవర్గంలో జనసేనలోని కీలక నేతలు, ఆ పార్టీ సానుభూతిపరులు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. జనసేనకు మద్దతుగా నిలిచిన ఒక ప్రధాన సామాజికవర్గం టీడీపీకి దూరం కావడం విశేషం. ఇక్కడ జనసేన ఎంపీ స్థానానికి పోటీ చేయలేదు. టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. దీంతో ఆ సామాజికవర్గం ఓటర్లలో అత్యధికులు ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ వైఎస్సార్ సీపీకే వేశారని చెబుతున్నారు. అమలాపురంతో పాటు జనసేన నుంచి సీట్లు ఆశించిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు ముందుగానే ఆ పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆ ప్రభావంతో ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు, మండపేట నియోజకవర్గాల్లో సైతం జనసేన నుంచి టీడీపీకి ఓటు బదిలీ అనుకున్న స్థాయిలో జరగలేదు. రామచంద్రపురం నియోజకవర్గంలో 14, 15 వార్డులతో పాటు వైఎస్సార్ నగర్ ఓటర్లు గతంలో జనసేనకు మద్దతుగా నిలిచారు. కానీ ఈసారి వారు బహిరంగంగానే వైఎస్సార్ సీపీకి మద్దతు పలికారు. మరో మిత్రపక్షం బీజేపీకి ఈ జిల్లాలో ఏ స్థానం నుంచీ పోటీ చేసే అవకాశం దక్కలేదు. దీంతో ప్రచారానికి, పోలింగ్‌కు ఆ పార్టీ దూరంగా ఉంది. సొంత పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాల్లో ప్రచారానికి స్థానిక నాయకులు వెళ్లడంతో పాటు పోలింగ్ ఏర్పాట్లలో పాల్గొన్నారు. మిత్రపక్షాల మధ్య కొరవడిన సమన్వయం.. వెన్నుపోటు రాజకీయాల వల్లే తమ విజయావకాశాలు దెబ్బ తిన్నాయని టీడీపీ, జనసేన అభ్యర్థులు వాపోతుండడం విశేషం.

అపనమ్మకాలు, అనుమానాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 13న ఎన్నికలు జరిగాయి. అమలాపురం లోక్‌సభతో పాటు ఐదు అసెంబ్లీ స్థానాల నుంచి టీడీపీ పోటీ చేయగా.. పి.గన్నవరం, రాజోలు ఎస్సీ అసెంబ్లీ స్థానాల నుంచి జనసేన పోటీ చేసింది. మరో మిత్ర పక్షమైన బీజేపీకి ఒక్క స్థానం కూడా కేటాయించలేదు. పొత్తు అనుకున్నప్పటి నుంచే మూడు పార్టీల మధ్య లొల్లి మొదలయ్యింది. అప్పటి నుంచి పోలింగ్ వరకూ విభేదాలు, అపనమ్మకాలు, అనుమానాలతోనే కూటమి ప్రయాణం సాగింది. పోలింగ్ సమయంలో ఇది మరింత ప్రస్ఫుటమైంది.

జూన్ 4 విడుదల

- అందరి చూపు..ఆ తేదీ పైనే
- సర్వత్రా ఎన్నికల ఫలితాల ఉత్కంఠ
- రచ్చబండల వద్ద రసవత్తర చర్చలు

రాయవరం: ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా ఒకటే మాట. సాధారణ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్న అంశంపైనే చర్చ సాగుతుంది. ఈ నెల 13న పోలింగ్ ముగిసిన నాటి నుంచి ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండల వద్ద జూన్ 4న విడుదలయ్యే ఎన్నికల ఫలితాలపై జోరుగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. చర్చలకు ఫుల్‌స్టాప్ పడాలంటే ఫలితాలు విడుదల కావడం ఒక్కటే మార్గం.

ఫలితాల కోసం ఉత్కంఠ : ఈ నెల 13న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన నాల్గవ దశలో ఎన్నికలు నిర్వహించారు. 2019లో ఫలితాల కోసం..41 రోజులు వేచి చూడాల్సి రాగా..ఈసారి 21 రోజులు పాటు ఫలితాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాల్గవ దశలోనే ఎన్నికలు జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నెల 20న ఐదవ విడత, 25న ఆరవ విడత, జూన్1న ఏడవదైన చివరి విడత ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

వారం రోజుల వ్యవధిలో : 2019 సాధారణ ఎన్నికల ఫలితాలు మే 23న విడుదలైన విషయం అందరికీ తెలిసిందే. 2014 సాధారణ ఎన్నికల ఫలితాలు మే 16న వెల్లడి కాగా, అంతకు ముందు 2009 సాధారణ ఎన్నికల ఫలితాలు కూడా మే 16వ తేదీనే వెల్లడి కావడం గమనార్హం. అయితే ఈసారి ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదలవుతున్నాయి. గత ఎన్నికల ఫలితాలకన్నా 11 రోజులు ఆలస్యంగా వెలువడుతున్నాయి. 2019లో జరిగిన జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 175 స్థానాలకు 151 స్థానాలను వైఎస్సార్ సీపీ కై వసం చేసుకుంది. ప్రస్తుతం జరిగిన సాధారణ ఎన్నికలు కూడా 2019 నాటి ఫలితాలనే రిపీట్ చేస్తాయన్న సంకేతాలు వస్తున్నాయి. ఎక్కడికక్కడ భారీగా పోలింగ్ జరగడం, వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓటు వేయడం ప్రభుత్వంపై పాజిటివ్ ఓటుకు నిదర్శనమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలింగ్ సరళి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లే ముందు ఐ-ప్యాక్ టీమ్‌ను కలిసిన అనంతరం ఫలితాలపై చేసిన ప్రకటన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించింది.

ఎవరు గెలుస్తారో.. : రచ్చబండల వద్ద రసవత్తర రాజకీయ చర్చలు సాగుతున్నాయి. అమలాపురం ఎంపీ, మండపేట ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు అవకాశాలతో పాటు సీమాంధ్రలో ఏ పార్టీ విజయం సాధిస్తుంది? వైఎస్సార్ సీపీ, కూటమి గెలుపు అవకాశాలు? పవన్ కళ్యాణ్ విజయం సాధిస్తారా? లేదా? ఎంత మెజారిటీ వస్తుంది? పక్క నియోజకవర్గాల్లో ఏ అభ్యర్థి గెలుస్తాడు? ఎంత మెజార్టీతో గెలుస్తాడు? చంద్రబాబు తనయుడు లోకేష్ విజయం సాధిస్తాడా? ఇలా పలు అంశాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి.

జోరుగా బెట్టింగులు. : అభ్యర్థులు, పార్టీల గెలుపోటములు, మెజార్టీలపై గ్రామాల్లో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. తమ తమ నియోజకవర్గాల్లో ఎవరు ఎమ్మెల్యేగా ఎన్నికవుతారు? ఎంత మెజార్టీతో విజయం సాధిస్తారు? సీమాంధ్రలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఇలా పలు అంశాలపై బెట్టింగులు సాగుతున్నాయి. నమ్మకమైన వ్యక్తుల వద్ద డబ్బులు ఉంచి పందేలు కాసుకుంటున్నారు. గ్రామాల్లో బెట్టింగులు రూ.లక్షల్లో సాగుతున్నట్టు వినికిడి.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ హత్య


సంధ్య మృతదేహం

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు రాజులకొత్తూరు నుంచి టి.వెంకటాపురం వెళ్లే మట్టి రోడ్డులో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఆదివారం తేటగుంట వీఆర్‌ఓ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ సీఐ ఎస్‌పీవీఎస్ మూర్తి, ఎస్సై డి.రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి శరీరంపై ఎరుపు రంగు జాకెట్ ఉంది. ఇతర వస్త్రాలు ఏమీ లేవు. చేతులు, కాళ్లు కట్టివేసి ఉన్నాయి. మహిళ హత్యకు గురైనట్టుగా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తులో తుని పట్టణం దిబ్బల పాలెం (తారక రామకాలనీ)కి చెందిన కుమారి అనే సంధ్య (30)గా గుర్తించినట్టు సీఐ తెలిపారు. హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ వదిలేశారా, మృతదేహం ఉన్న ప్రాంతంలోనే హత్యకు గురయ్యిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో తరచూ సంచరిస్తున్నట్టు సమాచారం లభించిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


తాతపూడి వద్ద గోదావరిలో దొరికిన సంపత్‌రెడ్డి మృతదేహం


సత్తి సంపత్‌రెడ్డి (ఫైల్)


రావులపాలెం: గౌతమి గోదావరిలోకి స్నానానికి వెళ్లి ముగ్గురు యువకులు శనివారం గల్లంతు కాగా వారిలో ఇద్దరి మృతదేహాలు దొరికిన విషయం తెలిసిందే. మూడో వ్యక్తి సత్తి సంపత్ రెడ్డి (15) మృతదేహం ఆదివారం కనుగొన్నట్టు సీఐ ఎం.ఆంజనేయులు తెలిపారు. రావులపాలెం గౌతమి పాత బ్రిడ్జి సమీపంలో గల్లంతైన సంపత్ రెడ్డి ఆచూకీ కోసం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో రెండు పడవలపై గాలింపు చర్యలు చేపట్టడంతో కపిలేశ్వరం మండలం తాతపూడి ఇసుక ర్యాంపు సమీపంలో గోదావరిలో లభించినట్టు తెలిపారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

మహిళకు పాము కాటు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి నక్కావారిపేటకు చెందిన నక్కా లక్ష్మి(40) ఆదివారం మధ్యాహ్నం పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. లక్ష్మి ఇంటి ఆవరణలో సంచరిస్తుండగా తాచు పాము కాటు వేసింది. ఆమె తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

స్నానాల సరదా ప్రాణాల మీదికి

- విషాదాన్ని మిగులుస్తున్న గోదావరిలో ఈత సరదా
- ఈ నెలలోనే ఏడుగురు మృత్యువాత
- ప్రభుత్వ గణాంకాల మేరకు గత పదేళ్లలో 29 మంది మృతి
- రికార్డులకెక్కని మృతులెందరో ఉన్నారంటున్న జనం
- స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న నిపుణులు


గౌతమీ గోదావరిలో రావులపాలెం వద్ద మునిగిపోయిన వారి కోసం పడవలపై గాలిస్తున్న గజ ఈతగాళ్లు (ఫైల్)


రావులపాలెం వద్ద గోదావరిలో మునిగిన యువకుడిని బయటకు తీసుకు వచ్చిన గజ ఈతగాళ్లు (ఫైల్)

ఆలమూరు: వేసవికాలం వచ్చేసింది. విద్యార్థుల్లో ఆటవిడుపు మొదలైంది. నదీ పరివాహక ప్రాంతాల్లో అనువుగా ఉండే ప్రదేశాల్లో స్నానాలు చేసేందుకు యువకులు ఉవ్విళ్లూరుతున్నారు. గోదావరిలో ఒక్కసారైనా స్నానమాచరించాలనే కోరికను తీర్చుకునేందుకు పర్యాటకులు ఉబలాటపడుతున్నారు. గోదావరిలో స్నానం చేసే సమయంలో కాని, ఈత కొట్టే సమయంలో కాని ఏమాత్రం ఏమరపాటు ప్రదర్శించినా మృత్యువాత పడతామని, తల్లిదండ్రులను ఒంటరివాళ్లను చేస్తామని మాత్రం ఊహించడం లేదు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాల వెంబడి గౌతమీ, వశిష్ట, వైనతేయ గోదావరి నదులు ప్రవహిస్తుంటాయి. ఈ ప్రాంతాల్లోని పలు ప్రదేశాలు బీచ్‌లను తలపిస్తూ ఆహ్లాదం పంచుతుంటాయి. గోదావరి పరిసర ప్రాంత వాసులే కాకుండా స్థానికులు, బంధువులు, స్నేహితులు, పర్యాటకులు నదీ తీరానికి వచ్చి ఆహ్లాదకర వాతావరణంలో ఉల్లాసంగా గడిపేందుకు ఇష్టపడతారు. ఇదే క్రమంలో గోదావరిలో స్నానాలు చేస్తూ ఈత సరదాను తీర్చుకునే క్రమంలో అనేక మంది ప్రమాదవశాత్తూ మునిగి ప్రాణాలను కోల్పోతున్నారు. నదుల పరివాహక ప్రాంతంలో ఊబిలు ఉన్న సంగతి తెలియని పర్యాటకులు స్నానాలకు దిగి మృత్యువాత పడుతున్నారు. కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు.

గోదావరిలో స్నానం.. తీవ్ర విషాదం

ఆలమూరు మండలంలోని బడుగువానిలంక పుష్కర ఘాట్ సమీపంలోనున్న గోదావరి తీర ప్రాంతంలో గడచిన ఐదేళ్ల కాలంలో ఎనిమిది ప్రమాదాలు సంభవించగా 12 మంది మృతి చెందారు. ఆత్రేయపురం మండలం సరిహద్దు ప్రాంతమైన మద్దూరులంకలో స్నానాలు చేస్తూ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. బడుగువానిలంక రేవులో 2019 ఏప్రిల్ 19న మడికి శివారు నాగులపేటకు చెందిన ఇద్దరు యువకులు, 2020 మే 13న కడియపులంకకు చెందిన తీగిరెడ్డి రాంబాబు (22) మృతి చెందాడు. అదే ఏడాది అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కుటుంబ సభ్యుల కళ్ల ఎదురుగానే గోదావరిలో జూన్ రెండున మునిగి మృతి చెందారు. 2022 మార్చి 20న చెముడులంకకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా మరో విద్యార్థి సురక్షితంగా బయటపడ్డాడు. 2023 ఏప్రిల్ 14న కె.గంగవరం మండలంలోని కూళ్లలో ముగ్గురు యువకులు స్నానం చేస్తూ మునిగిపోయి మృతి చెందారు. మద్దూరులంకలో 2022 జనవరి 30న నిడదవోలుకు చెందిన గొడవర్తి రవితేజ, 2023 మే 24న చిన తాడేపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, 25న అక్కాచెల్లెళ్లు, జూన్ నాలుగున మద్దూరులంకలో రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.సాంబశివరావు స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తూ మృతి చెందారు. మూలస్థాన అగ్రహారంలో 2015 మే 01న జరిగిన ప్రమాదంలో నలుగురు, జొన్నాడలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు, 2023 అక్టోబర్ ఏడున జొన్నాడలో జరిగిన ప్రమాదంలో కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లికి చెందిన ఇద్దరు యువకులు స్నానం చేస్తూ మృత్యువాత పడ్డారు. ఈ నెల 11న ఆత్రేయపురం మండలంలోని పిచ్చుకలంక వద్ద గోదావరి తీరంలో ఈతకొడుతూ ప్రమాదవశాత్తు మునిగి తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడికి చెందిన జీవీవీ శశికుమార్ మృతి చెందగా ముగ్గురు స్నేహితులు సురక్షితంగా బయట పడ్డారు. 12న బడుగువానిలంక నుంచి గోదావరి మీదుగా వాడపల్లి నడచి వెళుతూ ప్రమాదవశాత్తూ మునిగిపోయి ముగ్గురు మహిళలు మృతి చెందారు. రావులపాలెంలో ఈనెల 18న స్నానాలకు దిగి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఇంకా అనేక మంది గల్లంతయ్యారు. రికార్డులకు ఎక్కని మృతులు సంఖ్య, గల్లంతై ఆచూకీ లభ్యం కాని ఘటనలు ఉన్నాయని పోలీసు రికార్డులను బట్టి తెలుస్తోంది.

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇలా..

ప్రమాదం జరిగిన తేదీ	ప్రదేశం	మృతుల సంఖ్య
2015 మార్చి 03	మూలస్థాన అగ్రహారం	3
2019 ఏప్రిల్ 19	బడుగువానిలంక	2
2020 మే 20	బడుగువానిలంక	1
2020 జూన్ 2	బడుగువానిలంక	2
2022 జనవరి 30	మద్దూరులంక	1
2022 మార్చి 20	బడుగువానిలంక	2
2023 ఏప్రిల్ 14	కూళ్ల	3
2023 మే 24	మద్దూరులంక	1
2023 మే 25	మద్దూరులంక	2
2023 జూన్ 02	మద్దూరులంక	1
2023 జూన్ 27	వద్దిపర్రులంక	2
2024 ఏప్రిల్ 23	కపిలేశ్వరపురం	1
2024 మే 11	పిచ్చుకలంక	1
2024 మే 12	వాడపల్లి లంక	3
2024 మే 18	రావులపాలెం	3
2024 మే 19	బొబ్బర్లంక	1
		29

చర్యలు తీసుకోవాలి

- గోదావరి నదీ తీరాల్లో ప్రమాదాల నివారణకు పంచాయతీరాజ్, హెడ్‌వర్క్స్‌శాఖ పోలీసుశాఖ ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలి.
- గోదావరి పరీవాహక ప్రాంతంలో పోలీసు గస్తీ ముమ్మరం చేసి వేగం పెంచాలి. అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- ప్రమాదకరమైన అన్ని రేవుల వద్ద లోతు వివరాలు తెలియజేసే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలి.
- నదీ పరివాహక గ్రామాల్లో స్నానాలకు అనుమతి లేని ప్రదేశాల వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి.
- స్నానాలు చేసేటప్పుడు, ఈత కొడుతున్నప్పుడు ప్రతి ఒక్కరూ స్వీయరక్షణ చర్యలు పాటించాలి.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



గ్రామంలో జరిగిన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. ఇప్పటికే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని అప్రమత్తం చేస్తున్నాం. గ్రామస్తులు కూడా ప్రమాదాల నివారణకు తమ వంతు సహకారం అందిస్తున్నారు.

– దూలం వెంకటలక్ష్మి, సర్పంచ్, బడుగువానిలంక

గస్తీ ముమ్మరం చేస్తాం



గోదావరి తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరి సహకారంతో ప్రమాదకరమైన ప్రదేశాలను గుర్తిస్తున్నాం. ఈ ప్రమాదాలపై వివిధ శాఖాధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాం. నదీ తీరంలో ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసుశాఖ గస్తీలను ముమ్మరం చేస్తుంది.

– కేవీ రమణ, డీఎస్పీ, కొత్తపేట

ప్రమాదాల నివారణకు చర్యలు



నదీతీర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. అనుమతి లేని ప్రదేశాల్లో స్నానాల కోసం దిగవద్దు. ధవళేశ్వరం దిగువ ప్రాంతాల్లో ఊబిలు ఎక్కువగా ఉన్నందున తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. – ఆర్.విశ్వనాథరాజు, హెడ్‌వర్క్స్ జేఈ, ధవళేశ్వరం

మహిళ కడుపులో 570 రాళ్లు

అరుదైన సర్జరీతో తొలగించిన వైద్యులు

అమలాపురం టౌన్: పిత్తాశయంలో రాళ్లతో తీవ్ర ఇబ్బంది పడుతున్న ఒక మహిళకు అమలాపురంలో ఏఎస్ఐ ఆసుపత్రి వైద్యులు అరుదైన చికిత్స చేసి కడుపులో ఉన్న 570 రాళ్లు తొలగించారు. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన జాలెం నరసవేణి అనే 31 సంవత్సరాల మహిళ కొంత కాలంగా విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. రెండు రోజుల కిందట దేవగుప్తం నుంచి అమలాపురంలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యుడు నల్రా శ్రీనివాసులు పరీక్ష చేసి, స్కానింగ్ చేయించగా గాల్ బ్లాడర్ (పిత్తాశయం పసరు సంచి)లో ఒక పెద్ద రాయి(6.1 సెంటీమీటర్లు) లేక చిన్నవి చాలా ఉండొచ్చు అని తెలియజేశారు. శనివారం సాయంత్రం లాప్రోస్కోపీ ద్వారా సర్జరీ చేశారు. ఏకంగా 570 రాళ్లు పిత్తాశయంలో ఉన్నాయని, వాటిని సర్జరీ ద్వారా తొలగించామని ఆసుపత్రి వైద్యులు గుండాబత్తుల అంజలి ఆదివారం తెలిపారు. నరసవేణి ఆరోగ్యంగా ఉన్నారని, చికిత్స పొందుతున్నారని తెలిపారు.


మహిళ కడుపులోనుంచి తొలగించిన 570 రాళ్లు

వైద్యులపై దాడులు ఆగాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): ఇటీవల కాలంలో వైద్యులు, ఆసుపత్రులపై దాడులు అధికమయ్యాయని, వాటి వల్ల తాము భారీ మూల్యం చెల్లించుకోవల్సి వస్తోందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో రాజమహేంద్రవరం ఒబెస్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యులపై జరుగుతున్న దాడులపై ప్రజా అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు డాక్టర్ కె.అరుణకుమారి, కార్యదర్శి డాక్టర్ ఎం.దేవిశ్రీ సమన్వయకర్తలుగా, మానస ఆసుపత్రి అధినేత డాక్టర్ కర్రి రామారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించారు. ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైద్యులపై జరుగుతున్న దాడులను, చట్టపరంగా నియంత్రించాల్సిన విధానాలను సెక్షన్లతో సహా మెడికో లీగల్ కన్సల్‌టెంట్ డాక్టర్ హితేష్ భట్ వివరించారు. ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ కందుల సాయి, ఎస్ఎస్ రామరాజు, డాక్టర్ వై.గురుప్రసాద్, డాక్టర్ అనసూరి పద్మలత, డాక్టర్ కోమలి ప్రసంగించారు.

జీవవైవిధ్యం పరిరక్షణతో మానవ మనుగడ

బాలాజీచెరువు: జీవవైవిధ్యం పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జేఎన్‌టీయూకే ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ భారతదేశం జీవవైవిధ్యపరంగా అతిబలమైన దేశమని, ప్రపంచదేశాలతో పోలిస్తే 17వ స్థానంలో ఉందన్నారు. ఇక్కడ సుమారు 1,200 పక్షిజాతులు, వివిధ జంతువులు ఉన్నాయని తెలిపారు. నాల్గవ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు 273 మంది పాల్గొనగా వీరికి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త వై.శివప్రసాద్, నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్స్ వీరభద్రరావు, రమణామూర్తి, పిల్లి గోవిందరాజు పాల్గొన్నారు.



పర్యావరణ పోటీల సందర్భంగా మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

ఫేస్‌బుక్ ఫేక్ ఐడీతో అర్ధ నగ్న చిత్రాల పోస్ట్

- పట్టణ పోలీసులను ఆశ్రయించిన మహిళ
- యువకుడితో పాటు మరో యువతిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు

నిడదవోలు : ఓ మహిళతోపాటు ఆమె భర్త ఫొటోతో ఫేస్‌బుక్ ఫేక్ ఐడీ క్రియేట్ చేసి దానిలో నుంచి ఇతరులకు అర్ధ నగ్న చిత్రాలను పోస్ట్ చేస్తున్న ఓ యువకుడు, యువతిపై నిడదవోలు పోలీసులు ఆదివారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిడదవోలు పట్టణ ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు పట్టణంలోని అన్నపూర్ణనగర్‌కు చెందిన ఓ మహిళ, ఆమె భర్త ఫొటోతో నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన పోలవరపు దుర్గాప్రసాద్ ఫేస్‌బుక్ ఫేక్ ఐడీ క్రియేట్ చేశాడు. దాని నుంచి బాధిత మహిళ ముఖాన్ని అర్ధ నగ్న మహిళల చిత్రాలతో మార్ఫింగ్ చేసి ఇతర ఫేస్ బుక్ అకౌంట్లకు పంపాడు. ఇదే క్రమంలో అన్నపూర్ణనగర్‌కు చెందిన ఓ యువతి బాధిత మహిళ ముఖంతో కూడిన అర్ధనగ్న చిత్రాలను పోస్ట్ చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధిత మహిళ నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిడదవోలు సీఐ జె.జానకిరామ్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పోలవరపు దుర్గాప్రసాద్‌తో పాటు మరో యువతిపై సెక్షన్ 417 మోసం, సెక్షన్ 506 బెదిరింపులు, సెక్షన్ 354–డి అర్ధనగ్న చిత్రాల పోస్టులు, 2000– 2009 ఐటీ యాక్ట్ ప్రకారం కేసులను నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు

కొత్తపల్లి: ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. మండలంలోని నాగులాపల్లికి చెందిన సంధ్యకు గొల్లప్రోలు మండలం మల్లవరానికి చెందిన పెనుమల్లు భాస్కర్‌రెడ్డికి ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి మూడు సంవత్సరాల కుమార్తె ఉంది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య అదనపు కట్నంకోసం వివాదం చోటు చేసుకోవడంతో విడివిడిగా ఉంటున్నారు. సంధ్య కాపురం విషయంపై మాట్లాడేందుకు మల్లవరం వెళ్లగా అత్తమామలు సుబ్బలక్ష్మి, రామకృష్ణారెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు తగాదాకు దిగారు. దీనిపై సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భాస్కర్‌రెడ్డి, సుబ్బలక్ష్మి, రామకృష్ణారెడ్డిలతో పాటు మరో ముగ్గురిపై వరకట్న వేధింపుల కేసును ఎస్సై స్వామినాయుడు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు ఎన్‌హెచ్‌పై నరేంద్రగిరి సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతుని వివరాలు సేకరిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: మండలంలోని తానేల్లంకకు చెందిన కొంకి జ్యోతి కృష్ణ(35) మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల 16న జ్యోతికృష్ణ మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. అతనిని స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య ఉమామహేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తు తెలియని మృతుడు

రాజమహేంద్రవరం సిటీ: ఇటీవల ప్రమాదానికి గురై సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై మావుళ్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్ ఏరియా దగ్గరలో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా 108 అంబులెన్స్ ద్వారా గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించామన్నారు. తెలుపు, నీలం గీతల ఫుల్ హాండ్స్ చొక్కా, ముదురు నీలం రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. వివరాలకు 94406 27551, 94914 44022, 08332442821 నంబర్లలో సంప్రదించాలన్నారు.


ఆటో, మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామం రావిగుంట చెరువు వద్ద ఆదివారం సాయంత్రం ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లి మండలం ముక్తేశ్వరం నుంచి అమలాపురం వెళుతున్న ఆటోను ముక్తేశ్వరం వస్తున్న మోటార్ సైకిలిస్టు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న మండలంలోని నల్లచెరువు గ్రామానికి చెందిన ఒంగ్రి ప్రవీణ్‌కుమార్, కొత్త చిరంజీవి తీవ్రగాయాల పాలయ్యారు. గాయపడిన వీరిని స్థానికులు 108లో అమలాపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని అయినవిల్లి పోలీసులు తెలిపారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందించారు. కర్ణాటకకు చెందిన రాచపల్లి మంజునాథ్, పద్మావతి దంపతులు రూ.11,116 విరాళంగా అందించారు. కర్ణాటకకు చెందిన మరో దాత పెనుకుదురు లక్ష్మణరావు, లక్ష్మీగీత దంపతులు రూ.10,001 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. విరాళం అందించిన దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. బాల బాలాజీ స్వామికి ఆదివారం లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1.28 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ తెలిపారు. నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.1.08 లక్షలు విరాళాలుగా అందించారని చెప్పారు. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.2.37 లక్షల ఆదాయం లభించిందన్నారు. 2,681 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, 1,974 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

జేఈఈ (మెయిన్) బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాలలో తిరుమల సంచలనం


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ ప్రిన్సిపాల్ శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ(మెయిన్) బి–ఆర్క్ అండ్ బి–ప్లాన్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్టు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బి ప్లానింగ్ విభాగంలో ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా 1వ ర్యాంకు సాధించి మరోసారి «తిరుమల» విద్యార్థులు తమ సత్తా చాటారని ఆయన అన్నారు. కె.సాకేత్ ప్రణవ్ ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా 1వ ర్యాంకు, వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో తమ విద్యార్థులు కేజే వెంకటసాయి 2వర్యాంకు, పప్పుల దినేష్ 8వ ర్యాంకు, కేవీ సత్యనీలచలం 8వ ర్యాంకు, ఎంఎస్.మణికంఠ 15వ ర్యాంకు, ఎంజీ వెంకటమహేష్ 15వర్యాంకు, జీఎస్.వెంకటసాయికృష్ణ 18వ ర్యాంకు, ఎస్.రాజీవ్ 20వ ర్యాంకు సాధించడంతో పాటు, 23, 24, 25, 26, 31, 32, 36, 40, 44, 50 ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు.

బి–ఆర్క్ విభాగంలో వివిధ కేటగిరీలలో జాతీయ స్థాయిలో తాటిపాక ఆదిత్య 4వ ర్యాంకు, కె.సాకేత్ ప్రణవ్ 5వ ర్యాంకు, కేజే వెంకటసాయి 5వర్యాంకు, పప్పుల దినేష్ 14వర్యాంకు, జీఎస్.వెంకటదుర్గా సాయి 17వర్యాంకు సాధించడంతో పాటుగా 21, 27, 35, 36, 40, 43 ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.